# నీచం

"సత్యా"

సాహిణిమనస్సు పరిపరివిధాల పోతున్నది.

రకరకాలైన ఊహలు, మంచితో ఈ లోకంలో నెగ్గలేవనుకునే మనస్సుకి విరివిగా కలిగేచెడుపీ, వాటికిదూరంగా అలల్లాగాకనపడి, వాటితో ఆడుకునేందుకు వీలులేని మంచిపీ, వస్తూ పోతూ ఉన్నాయి.

ఆ వానలోగూడా ఆ రిక్షాబండి తోలుతూ వెళ్లుతున్న వాళ్ళని చూసి సాహిణి ఎప్పుడూలేని వింతని పొందసాగింది వాళ్ళు ఎంతకష్టపడి సంపాదిస్తున్నారు? డబ్బనేది మనిషి మనుషిచేత పాదాలు ఒత్తించుకొనేందుకు, మోయించుకునేందుకుగూడా ఎట్లా చలామణీ అవుతుంది?

వాకిట్లో నిలుచున్న సాహిణికి లోపల తండ్రి దగ్గులు, చీత్కారాలు వినపడుతునే ఉన్నాయి. తనేంచేస్తుంది? తనే లోకంలో ఎప్పుడు ఒకర్ని సిగ్గు విడిచి యాచించంది ఇవాళయాచించి నిరుత్సాహపడ్డది. తనదగ్గర దమ్మిడీఉన్నా, తననితను దమ్మిడీ ఉందిన్నదాన్ని అనుకోవచ్చుకాని, దమ్మిడీగూడాలేనప్పుడు తననిగురించి తనేమనుకోవాలి? తనేంచేస్తే ఇప్పుడు నాణేలుగిడ్తాయి?

"ఏమండి అమ్మగారు బండికావాలా?" అన్నాడు రిక్షాఆపి, వాకిట్లో నిలుచున్న తనని చూస్తూ రిక్షావాడు.

"అక్కర్లేదు" అంది నిర్లక్ష్యంగా. వాడు తనవంక ఏమిటో కపటంతోమటుకు చూస్తున్నాడు. వాడు తననట్లూ చూడటానికి గల కారణం ఆలోచించటానికి అటు చూడకుండా ఉండలేకపోయింది.

"ఆ!...మీకు తెలీదమ్మా. బహుశా నా పేరు మీరు వినేవుంటారు....నాగయ్యా. ఎక్కడికన్నా....ఎవరిదగ్గరకన్నా తీసికెళ్ళాలా?'' అన్నాడు ముక్కుతూ.

సాహిణికి అంతా అర్థమయింది. ఒంటిగంటకి అట్లా వాకిట్లో నిలుచుకున్నంత మాత్రాన తనని ఎంత నీచురాలుగా తలచి, మాట్లాడాడు వాడు. వాళ్ళెట్లా సంపాయిస్తాననిగూడా తనెరుగు. సాహిణి ఎందుకో అప్యాయంగా వాడితోమాట్లాడడానికి ఆతృత పడుతున్నట్టుగాతలచింది. కాని తను గోతిలో పడుతుందేమో! అనే భయం.

"అదుగో....ఆ డాబా చూడండి. అక్కడో అబ్బాయున్నాడు....చంద్రమౌళిగారని—అక్కడికి....బాగాఇస్తాడమ్మాడబ్బు' అన్నాడు! తన మౌనం అంగీకారమే అనుకొని కాబోలు.

"పోరా వెధవ" అంటూ కోపంగా తలుపేసుకొని కుర్చీమీదతలపెట్టి ఆలోచించసాగింది గత సంఘటననిగూర్చి.

తను ఎంతనీచం చేస్తే....వాడు తనకి డబ్బిస్తాడు? ఆ నీచం లోకమంతా ఎంత హేయంగాచూస్తుంది. తనకి తను దాన్ని ఎంత అసహ్యించు కుంటున్నది?.

డబ్బు....డబ్బు....వస్తుంది....తండ్రికొంతకుదుట పడ్తాడు-నిజమే....తన జీవితానికి ఆఒక్క రాత్రి పెద్ద మచ్చవుతుంది. తను లోకానికి ఒక నీచురాలుగా కులటగా కనపడుతుంది. అది తను తన లేతనమనస్సు భరిస్తాయా? తనొక్క రాత్రి ఆ నీచంచే స్తేమటుకేమిటి? చెడిపోవటం సుళువుగాను మంచిగాను కూడా కనిపిస్తుంది కాబోలు! తండ్రి హాయిగా నిద్రబోతాడు.... తనకి కావాల్సింది ఆయన హాయైన నిద్రతప్ప మరేముంది ఇప్పుడు. తను తన జీవితంలో ఒక ఘనకార్యం చేసినట్టుగాదా!....ఆరిక్షావాడు.... తనని బండిమీద కూర్చోబెట్టుకుంటాడు.... అక్కడికి హాయిగా తీసుక వెళ్తాడు....మంచి మంచిమాటలు చెప్తాడు....

తరువాత చంద్రమౌళి తనని చూస్తాడు....."ఎంతకావాలి" అంటాడు....తను కోరినంత ఇస్తాడు....తను నీచం చేస్తుంది....డబ్బు తెస్తుంది...బజారు వెళ్తుంది....ఆహారం తెస్తుంది తండ్రి తింటాడు ... "ఎక్కడిది" అంటాడు. తను అబద్ధమాడ్తుంది...తండ్రి తనని మంచిదానివి అంటాడు....తను జీవితంలో మరెప్పుడుగూడా ఆతప్పు చేయకూడదనుకుంటుంది. కాని డబ్బులేనప్పుడల్లా అది గుర్తొస్తుంటుంది. తననది ఆకర్షిస్తుంది....అదే అలవాటౌతుంది. లోకమంతా తనని నీచురాలుగా చూస్తుంది. తను ఆర్జించేది ఖర్చవుతుంది. తనఅందం పూవుమాదరిగా వాడిపోతుంది. తననామకంగా ఈలోకాన్ని విడుస్తుంది—తన చెడ్డపేరుమటుకు కొన్నాళ్లు నిలుస్తుంది. లోకులు తనుండే చోటునిగూర్చి వింతగా చెప్పుకుంటారు.

ఇదంతా ఎందుకు? తనొనర్చిన ఒక్క తప్పుకు తనొనర్చిన ఒక్క ఘన కార్యానికి! ఘనకార్యం! తన తండ్రిని హాయొనర్చటం. తను తన తండ్రికి ఎనిచే స్తేమటుకేం? దానితో లోకానికేంపని! ఎంత విచిత్రం....

వంచినతల ఎత్తింది సాహిణి....లోకమంతా గిర్రున తిరుగుచున్నట్లయింది. . .తనేం ఆలోచించింది! తనేనాఅని ఆలోచించింది!. . . తను ఎంత పాపురాలు!

మర్నాడు మనియార్డరు వచ్చింది.... వందరూపాయిలు పిన్నిదగ్గర్నుంచి నాన్న పేర్న....

కాని, ఆపిన్ని తన తల్లి చెల్లెలుకాదని, తనతండ్రి యువకదశలో ఉంచినమనిషనీ, ఆమెద్వారానే తండ్రి బ్రతుకుతాడనిమటుకు సాహిణికి తెలీదు!

మర్నాడు సాహిణి ఆ డబ్బుతోనే దినుసులు తెచ్చింది కాని ఆ డబ్బుమటుకు నీచమైనది అని తనకు తెలీదు.

---

శ్రీ సాయిబాబా మెటల్ లాకెట్సు

వెల 1-కి 0-7-0 ఒక డజను వెల 4-12-0

(తపాలా ఛార్జీలతోసహా)

ఈక్రింది అడ్రెసుకు 7 అణాల తపాలాబిళ్లలు పంపిన యెడల మీకు వొక లాకెటు పంపబడును.

శ్రీ బాబా పబ్లికేషన్స్,

32, క్రిష్ణప్పనాయకన్ టాంక్ వీధి, జి.టి. మదరాసు.